సాక్షి ఖమ్మం

బుధవారం । 18 । జూన్ । 2025



దివ్యాంగులకు చేయూత

దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందించేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువు నేటితో ముగియనుంది. 8లో



పాఠశాలకు వెళ్లొస్తుండగా..

పాఠశాల ముగిశాక ఇంటికి వెళ్తున్న విద్యార్థుల ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. 8లో

గరిష్ఠం / కనిష్ఠం 37° / 27°

వాతావరణం

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం తర్వాత ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం, మంత్రి పొన్నం పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్/మధిర/ఖమ్మం వ్యవసాయం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి సామగ్రితో సహా సిబ్బంది చేరుకునేలా సమకూర్చిన విద్యుత్ అంబులెన్స్‌లను ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరిస్తారు. అలాగే, విద్యుత్ ఉద్యోగుల హెల్త్ క్యాంపును ప్రారంభించి అక్కడే ఉద్యోగులతో సమావేశమవుతారు. ఆతర్వాత మధ్యాహ్నం 12–30గంటలకు బోనకల్ మండలం జానకీపురం సబ్‌స్టేషన్‌లో రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టం, ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లను డిప్యూటీ సీఎం ఆవిష్కరిస్తారు. ఇక రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉదయం 10–30 గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అధికారులతో వివిధ పథకాలపై సమీక్షిస్తారు. అనంతరం మధిరలో రూ.9.49కోట్లతో నిర్మించే నూతన బస్టాండ్ పనులకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం శంకుస్థాపన చేయనున్నారు.

ఈనెల 30 వరకు సన్నబియ్యం పంపిణీ



డీలర్‌కు సూచనలు చేస్తున్న డీసీఎస్‌ఓ చందన్‌కుమార్

ఖమ్మం అర్బన్: జిల్లాలో చివరి రేషన్ కార్డుదారుల వరకు మూడు నెలల సన్నబియ్యం పంపిణీ జరుగుతుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి(డీసీఎస్‌ఓ) చందన్‌కుమార్ తెలిపారు. పలు షాప్‌ల్లో క్యూ ఉంటోందని, స్టాక్ లేదనే బోర్డులు ఏర్పాటుచేస్తున్నారనే సమాచారంతో ఆయన మంగళవారం ఖమ్మం ప్రకాశ్‌నగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీలర్లకు సూచనలు చేసిన డీసీఎస్‌ఓ లబ్ధిదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మూడు నెలల సన్న బియ్యం కోటా కార్డుదారులకు అందించాలని డీలర్లకు సూచించారు. కార్డుల్లో చనిపోయిన వారి పేరు ఉంటే సమాచారం ఇవ్వడమే కాక కార్డుదారులంతా ఈ కేవైసీ చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కాగా, ఈనెల 30వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేయనున్నందున లబ్ధిదారులు ఆందోళన చెందొద్దని తెలిపారు. ఖమ్మం అర్బన్ డీటీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు టెండర్లు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో రహదారుల అభివృద్ధి, మరమ్మతుల(వార్షిక నిర్వహణ) కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, పనులు చేపట్టేందుకు ఆర్ అండ్ బీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఏటా సాధారణ మరమ్మతుల్లో భాగంగా ఈ పనులు చేపట్టనున్నారు. ఖమ్మం, సత్తుపల్లి డివిజన్ల పరిధిలో పలుచోట్ల రోడ్లు దెబ్బతినడంతో, వాటిపై గుంతలు పూడ్చడం, రోడ్డు మార్జిన్లలో చెత్త తొలగింపు, నీరు నిల్వలు ఉండకుండా పనులు చేపడుతారు. ఖమ్మం డివిజన్ పరిధిలో 20 పనులకు రూ.1.46 కోట్లు మంజూరు కాగా, పనులు అప్పగించేందుకు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. వర్షాలు పూర్తిస్థాయిలో మొదలుకాక ముందే రహదారుల మరమ్మతు పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు ఆర్ అండ్‌బీ అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రహదారుల పరిస్థితిని సమీక్షించాక మరమ్మతులు అవసరమైన చోట పనులకు నిధులు కేటాయించామని వెల్లడించారు.

ప్రారంభమైన టీజీ ఈసెట్ కౌన్సెలింగ్



విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న అధికారులు

ఖమ్మంసహకారనగర్: పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేలా నిర్వహించిన తెలంగాణ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితా లు ఇటీవల వెల్లడయ్యాయి. ఈమేరకు అర్హత సాధించిన విద్యార్థులకు ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో మంగళవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. తొలిరోజు 105 మంది స్లాట్ బుక్ చేసుకోగా, 102 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. కాగా, కౌన్సెలింగ్ 19వ తేదీ వరకు కొనసాగుతుందని వెల్లడించారు.

నిరుపేదల్లో డబుల్ ఆశలు

సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల కలను నిజం చేసేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సొంత స్థలం లేని నిరుపేదలకు గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తయిన, వివిధ దశల్లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని నిర్ణయించింది. తద్వారా జిల్లాలోని 1,181 మందికి లబ్ధి జరగనుంది. ఇప్పటికే సిద్ధంగా ఉన్న 526 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయడమే కాక వివిధ దశల్లో ఉన్న 655 ఇళ్ల పనులు పూర్తిచేశాక లబ్ధిదారులకు కేటాయించనున్నారు. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం



ఈ ఇళ్లకు మోక్షం..

నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలో 2020 ఏడాదిలో 30 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని అప్పటి ప్రభుత్వం చేపట్టింది. కానీ రకరకాల కారణాలతో పూర్తి కాలేదు. తొమ్మిది ఇళ్లు పిల్లర్ల స్థాయిలో, మిగిలినవి స్లాబ్ వేసి వదిలేశారు. ఈ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 160మంది దరఖాస్తు చేసుకోగా, 33మందికి మంజూరు చేయడంతో నిర్మాణం చేపట్టారు. మిగిలిన దరఖాస్తుదారుల్లో 30మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి కేటాయించనున్నారు.

ఇళ్ల అంశంలో ప్రభుత్వం కీలక నిర్ణయం

- ఎల్–2 కేటగిరీ దరఖాస్తుదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు
- జిల్లాలో సిద్ధంగా 526, నిర్మాణంలో 655 గృహాలు

ఇందిరమ్మ దరఖాస్తులు 3,48,639

ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించగా 3,48,639 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎల్–1, 2, 3 కేటగిరీలుగా విభజించి ఎల్–1 దరఖాస్తుదారులకు ప్రాధాన్యత ఇచ్చారు. సొంత స్థలం ఉండి గుడిసె, రేకులషెడ్, టైల్స్ వేసిన, అద్దె ఇళ్లలో ఉండేవారిని ఈ జాబితాలో పొందుపర్చారు. ఇక గుడిసె, రేకుల షెడ్, టైల్స్ వేసిన ఇళ్లు, అద్దె ఇళ్లలో ఉంటూ స్థలం లేని వారిని ఎల్–2 కింద, ఇల్లు ఉన్నా తల్లిదండ్రుల నుంచి విడిపోయిన తమకు సొంతంగా ఇల్లు కావాలని కోరిన వారిని ఎల్–3 కేటగిరీలో చేర్చారు.

పైలట్‌గా 885 మందికి..

పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన 20గ్రామపంచాయతీల్లో 885 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో ఇప్పటి వరకు 107ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, 278స్లాబ్, 500ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి. మిగతా గ్రామాల్లో 8,441మంది లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలు అందజేశారు. ఇవి కాక మరో 1,078ఇళ్ల మంజూరుకు జిల్లా నుంచి ప్రతిపాదించడంతో వారంలోగా మంజూరయ్యే అవకాశముంది.

ఎల్–2 కేటగిరీకి 'డబుల్' ఇళ్లు

గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కొన్ని పూర్తయినా పంపిణీ చేయలేదు. మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. జిల్లాకు గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 8,956 డబుల్ బెడ్‌రూం ఇళ్లలో 6,107నిర్మాణం పూర్తి చేసి 5,581ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించగా, ఇంకా 526 ఇళ్లు మిగిలిపోయాయి. ఇక 655 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో నిలిచిపోగా, మిగతా వాటి నిర్మాణం మొదలుపెట్టలేదు. ఖమ్మం నియోజకవర్గంలో 224, పాలేరులో 177, సత్తుపల్లిలో ఒకటి, మధిరలో 65, వైరా నియోజకవర్గంలో 188 ఇళ్లు వివిధ స్థాయిలో నిలిచిపోయాయి. దీంతో సొంత జాగా లేకుండా ఎల్–2 కేటగిరీలో చేర్చిన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

స్థలం లేని దరఖాస్తులు 56,576

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు మొత్తం 3,48,639 దరఖాస్తులు అందగా.. ఎల్ –1 కింద 73,388, ఎల్–2 కింద 56,576, ఎల్ –3 కింద 2,18,675 దరఖాస్తులు ఉన్నాయి. సొంత స్థలం లేని వారిని ఎల్–2 కింద చేర్చగా, ఇందులో అత్యంత నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేస్తారు. కాగా, ఈ కేటగిరీలో అత్యధికంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 31,498 దరఖాస్తులు, సత్తుపల్లి మున్సిపాలిటీలో 3,398, మధిర మున్సిపాలిటీలో 1,993, ఏదులాపురం మున్సిపాలిటీలో 1,668, వైరా మున్సిపాలిటీలో 1,506, రఘునాథపాలెం మండలంలో 1,195, చింతకాని మండలంలో 1,138 దరఖాస్తులు ఉన్నాయి.

అర్హులకు పంపిణీ..



నిర్మాణం పూర్తయి పంపిణీ చేయని డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆ గ్రామాల్లోని అత్యంత నిరుపేదలు, స్థలం లేని వారికి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ సూచనల మేరకు పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. జిల్లాలో 526 ఇళ్లు సిద్ధంగా ఉండగా, మరో 655 ఇళ్ల నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. వీటికి కూడా లబ్ధిదారులను ఎంపిక చేసి నిర్మాణం పూర్తి చేయిస్తాం.

– బి.శ్రీనివాస్, పీడీ, గృహ నిర్మాణ శాఖ

పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

నియోజకవర్గం	ఖమ్మం	సత్తుపల్లి	పాలేరు	కామేపల్లి (ఇల్లెందు)	మధిర
ఇళ్లు	301	108	47	40	30

జిల్లా ప్రగతిని కొనసాగించాలి..

- బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఆత్మీయ వీడ్కోలు పలికిన అధికారులు



ముజమ్మిల్‌ఖాన్‌ను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ తదితరులు

ఖమ్మంసహకారనగర్: అభివృద్ధి, సంక్షేమంలో ముందంజలో నిలుస్తున్న జిల్లాలో ప్రగతి కొనసాగేలా యంత్రాంగం కృషి చేయాలని బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ పౌర సరఫరాల శాఖ సంచాలకులుగా బదిలీ అయిన ఆయనను జిల్లా అధికారుల ఆధ్వర్యాన మంగళవారం కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. తొలుత అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, పోలీసు కమిషనర్ సునీల్ దత్, జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జెడ్పీ సీఈఓ దీక్షారైనాతో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో విధినిర్వహణలో తమకు ఉన్న అనుభవాలను వివరించారు. అనంతరం ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం నేల పవిత్రమైందని, ఇక్కడ పని చేయడంలో ఎంతో సంతృప్తి లభించిందని తెలిపారు. వరదల సమయాన ఇక్కడి అధికారులు, సిబ్బంది అద్భుతంగా పని చేశారని కొనియాడారు. ఎవరు ఉన్నా, లేకున్నా వ్యవస్థ ప్రజల కోసమే పని చేయాలని, వ్యక్తిగత ఆలోచనలు ఒకటి, రెండు శాతమే ఉంటాయని తెలిపారు. కాగా, బాల సదనం, అంగన్‌వాడీ కేంద్రాలకు సౌకర్యాలు సమకూర్చడం, అక్కడి పిల్లలతో మాట్లాడడం సంతృప్తి కలిగించాయని చెప్పారు. మహిళా మార్ట్, స్త్రీ టీ స్టాల్, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ శిక్షణ, మున్నేటి వరద సమయాన సహాయక చర్యలు, ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన తదితర కార్యక్రమాలు ఉద్యోగుల సహకారంతోనే విజయవంతమయ్యాయని ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు.

రూ. 200 కోట్లతో మార్కెట్ల అభివృద్ధి

- పత్తి కొనుగోళ్లలో అక్రమాలపై కొనసాగుతున్న విచారణ
- రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి



రైతు బజార్‌లో ఆకుకూరలు కొనుగోలు చేస్తున్న డైరెక్టర్ లక్ష్మీబాయి

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి ఈ ఆర్థిక సంవత్సరం రూ. 200 కోట్లు కేటాయించామని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి తెలిపారు. ఇందులో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మోడల్ మిర్చి మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.155 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. ఖమ్మంలో మోడల్ మిర్చి మార్కెట్ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించిన ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా లక్ష్మీబాయి మాట్లాడుతూ మిర్చి మోడల్ మార్కెట్‌ను వచ్చే సీజన్‌కల్లా పూర్తి చేస్తామని తెలిపారు. గడిచిన ఏడాది రాష్ట్రంలో మార్కెటింగ్ శాఖ ఆదాయ లక్ష్యం రూ.800 కోట్లు కాగా రూ.782 కోట్లు సాధించామని, ఈ ఏడాది మరింత పెంచేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. కాగా, సీసీఐ పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై విచారణ కొనసాగుతోందని, నివేదికల ఆధారంగా ఇంకొందరు ఉద్యోగులపై చర్యలు ఉంటాయని తెలిపారు. అనంతరం డైరెక్టర్ ఖమ్మం వీడీవోస్ కాలనీ, ఎన్‌ఎస్‌పీ క్యాంపు, పెవిలియన్ గ్రౌండ్ సమీపాన సమీకృత మార్కెట్లను పరిశీలించారు. వీడీవోస్ కాలనీ సమీకృత రైతు మార్కెట్‌లో ఏర్పాటు చేయనున్న సేంద్రియ మార్కెట్ పనులపై ఆరా తీశారు. ఇప్పటికే నిర్వహణలో ఉన్న కూరగాయలు, ఆకుకూరల విక్రయాలను పరిశీలించడమే కాక ఆకుకూరలు కొనుగోలు చేశారు. అయితే, రహదారుల వెంట విక్రయాలతో తమకు నష్టం ఎదురవుతోందని విక్రయదారులు చెప్పగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమాల్లో మార్కెటింగ్ శాఖ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్, అదనపు సంచాలకులు రవికుమార్, డీడీ పద్మావతి, ఎస్‌ఈ లక్ష్మణ్ గౌడ్, డీఈ యల్లేశ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీం, ఖమ్మం మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్లు యరగర్ల హన్మంతరావు, తల్లాడ రమేష్, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

తెరుచుకుంటున్న బడులు



కల్లూరు మండలంలో పునఃప్రారంభమైన ఓబుల్‌రావు బంజర్ పాఠశాల వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

- 'బడి బాట'తో సత్ఫలితాలు
- మూతబడిన స్కూళ్లలో పది పునఃప్రారంభం
- కల్లూరు మండలంలోనే ఐదు పాఠశాలలు


ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు చేపట్టిన బడిబాట జిల్లాలో సత్ఫలితాలను ఇస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలల్లో ప్రవేశాలు పెరగడమే కాక గతంలో మూతబడిన పాఠశాలలు సైతం తెరుచుకుంటుండడం విశేషం. ఇప్పటికే జిల్లాలో పది పాఠశాలలు పునఃప్రారంభం కాగా, ఇంకొన్ని కూడా తెరిచే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

5వేల మందికి పైగానే...

ప్రభుత్వ సూచనలతో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రతిష్టాత్మకంగా బడిబాట నిర్వహిస్తున్నారు. ఈమేరకు పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడమే కాక ఉచిత విద్య, పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం పంపిణీ, మధ్యాహ్న భోజన సౌకర్యాలపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తుండగా ప్రవేశాల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఈనెల 12వ తేదీ నుంచి ఇప్పటివరకు 5,807 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల్లో చేరారని డీఈఓ సామినేని సత్యనారాయణ, సీఎంఓ రాజశేఖర్ తెలిపారు. ఇందులో ఒకటో తరగతికి 2,544మంది, 2నుంచి 10వ తరగతులకు ప్రభుత్వ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలకు 2,087మంది చేరగా, ప్రైవేట్ పాఠశాలల నుండి 1,056 మంది విద్యార్థులు చేరారని వెల్లడించారు.

పది పాతవి, ఒకటి కొత్తగా...

జిల్లాలో ఈ విద్యాసంవత్సరం 11పాఠశాలలను అధికారులు కొత్తగా ప్రారంభించారు. ఇందులో పది పాఠశాలలు గతంలో విద్యార్థులు లేకపోవడంతో మూతబడ్డాయి. ఈసారి బడిబాటతో విద్యార్థులు చేరడంతో పునఃప్రారంభించారు. ఇక రఘునాథపాలెం మండలం పువ్వాడనగర్‌లో కొత్త పాఠశాలను ప్రారంభించగా, ఇందులో తొలి ఏడాదే 40 మంది విద్యార్థులు చేరడం విశేషం.



పునఃప్రారంభమైన పాఠశాలల వివరాలు

మండలం	పాఠశాల	విద్యార్థులు
కల్లూరు	ఎంపీపీఎస్, ఓబుల్‌రావు బంజర్	33
కల్లూరు	ఎంపీపీఎస్, రాజుపాలెం	21
కల్లూరు	ఎంపీయూపీఎస్, లక్ష్మీపురం	14
కల్లూరు	ఎంపీపీఎస్, పాయపూర్	09
కల్లూరు	ఎంపీపీఎస్, విశ్వనాథపురం	06
ఖమ్మం అర్బన్	ఎంపీపీఎస్, రుద్రంకోట	21
వైరా	ఎంపీపీఎస్, గౌడ్లపాలెం	11
పెనుబల్లి	ఎంపీపీఎస్, చిన్యాతండా	10
ఖమ్మం రూరల్	ఎంపీపీఎస్, దక్యాతండా	09
సింగరేణి	ఎంపీపీఎస్, కొత్తతండా	06

మూడెకరాల రైతులకు పెట్టుబడి సాయం జమ



ఖమ్మంవ్యవసాయం: రైతు భరోసా పథకం ద్వారా మంగళవారం మూడెకరాల భూమి కలిగిన రైతుల ఖాతాల్లో నగదు జమ అయింది. వానాకాలం పంటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.6వేల చొప్పున నగదు జమ చేసే ప్రక్రియను సోమవారం ప్రారంభించింది. జిల్లాలో 3,53,794 మంది రైతులు అర్హులు కాగా, వీరికి రూ.436,84,65,365 అందాల్సి ఉంది. తొలిరోజైన సోమవారం రెండెకరాల వరకు సాగు భూమి ఉన్న 2,13,932 మంది ఖాతాల్లో రూ.123,38,40,175లు జమ అయ్యాయి. ఇక మంగళవారం మూడెకరాలు కలిగిన 46,859 మంది రైతుల ఖాతాల్లో రూ.70,06,57,468 జమ చేయగా, జిల్లాలో ఇప్పటివరకు 2,60,791 మంది రైతుల ఖాతాల్లో రూ.193,44,97,643 జమ అయినట్లయింది. అయితే, ఈనెల 5వ తేదీ నాటికి నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు, డీబీటీ(డైరెక్టర్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ఫెయిల్ అయిన రైతులు ఏఈఓల వద్ద ఖాతా నంబర్లు నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య ఓ ప్రకటనలో సూచించారు.

కొత్తకొత్తగా.. మధిర బస్టాండ్

- అన్ని వసతులతో నిర్మాణానికి రూ.9.49 కోట్లు
- నేడు శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం



మధిర బస్‌స్టేషన్ (ఇన్‌సెట్) 1984లో నాటి సీఎం ఎన్టీఆర్ ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

మధిర: పల్లె, పట్నం తేడా లేకుండా ఆర్టీసీ బస్సులు నడిపిస్తుండగా.. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణం అమలవుతోంది. ఇదే సమయాన ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా శిథిలావస్థకు చేరిన బస్టాండ్ల స్థానంలో నూతన నిర్మాణాలకు ప్రభుత్వం, ఆర్టీసీ శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగానే మధిర బస్‌స్టేషన్ నిర్మాణానికి రూ.9.49 కోట్ల నిధులు కేటాయించారు. కింది అంతస్తులో ప్లాట్‌ఫామ్‌లు, షాప్‌లు, మొదటి అంతస్తులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అన్ని వసతులతో ఈ బస్‌స్టేషన్ నిర్మించనుండగా.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం శంకుస్థాపన చేయనున్నారు.

ఆరు బస్సులతో ప్రారంభం

మధిర డిపో, బస్‌స్టేషన్ 5.28ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. మధిర బస్‌స్టేషన్ నిర్మాణానికి 1984 ఏప్రిల్ 25న ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శంకుస్థాపన చేశారు. ఆతర్వాత డిపో 1987మార్చి 4న ఏర్పాటైంది. ఇక నిర్మాణం పూర్తయిన బస్‌స్టేషన్‌ను నాటి మార్కెటింగ్ శాఖ మంత్రి ముక్కపాటి వెంకటేశ్వరరావు 1990 అక్టోబర్ 26న ఆరు బస్సులతో ప్రారంభించారు. ఇప్పుడు 35 ఆర్టీసీ, 27 హైర్ బస్సులు నడుస్తుండగా, మధిర డిపో నుంచి 16 రూట్లలో 167 సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి. అన్నీ కలిపి 29,538 కి.మీ. తిరుగుతుండగా 30వేల మంది ప్రయాణికులతో రూ.17.42 లక్షల ఆదాయం నమోదవుతోంది. అత్యధిక కిలోమీటర్ పర్ లీటర్(కేఎంపీఎల్) నమోదులో ఖమ్మం రీజియన్‌లోనే మధిర డిపో మొదటి స్థానాన ఉండగా, 1987 – 2004 వరకు రాష్ట్రంలోనే అగ్రస్థానాన నిలిచింది. ప్రస్తుతం డిపోలో 65 మంది ఆర్టీసీ డ్రైవర్లు, 19 మంది కాంట్రాక్ట్ డ్రైవర్లు పనిచేస్తున్నారు. అలాగే, 103 మంది కండక్టర్లు, 120 మంది ఇతర ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.

వేధిస్తున్న సమస్యలు

మధిర తెలంగాణ – ఏపీ సరిహద్దుల్లో ఉంటుంది. రైల్వేస్టేషన్ సమీపంలోనే బస్టాండ్ ఉండడంతో మధిర ప్రాంత వాసులే కాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం, పెనుగంచిప్రోలు, వత్సవాయి, వీరులపాడు తదితర మండలాల ప్రజలు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే, బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు సరిపడా సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు ప్రాంగణంలో నీరు నిలుస్తుండడం.. టీవీలు, ఫ్యాన్లు పనిచేయకపోవడమే కాక తాగునీటి కోసం ఏర్పాటుచేసిన ఫ్రిజ్ అలంకారప్రాయంగా మారింది. మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా మారిన నేపథ్యాన సమస్యలను గుర్తించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నూతన సముదాయాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించారు. కొత్త బస్టాండ్ నిర్మాణం పూర్తయితే ప్రయాణికుల రద్దీ మరింత పెరగడంతో పాటు డిపో ఆదాయం సైతం పెరుగుతుందని భావిస్తున్నారు. కాగా, కొత్త బస్టాండ్ నిర్మించే వరకు బస్సులు నిలిపేందుకు తాత్కాలిక బస్‌స్టేషన్ ఏర్పాటుచేయనున్నారు.

సురక్షితంగా గమ్యస్థానానికి..



ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నాం. ఈక్రమంలోనే ప్రయాణికులకు సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం, సంస్థ దృష్టి సారించాయి. ఈమేరకు మధిరలో కొత్త భవన సముదాయం నిర్మాణానికి నిధులు కేటాయించారు. ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బలోపేతానికి సహకరించాలి.

– దాసరి శంకర్‌రావు, మధిర డిపో మేనేజర్

క్లుప్తంగా

విశ్వధర్మక్షేత్రానికి రూ.లక్ష వితరణ



నగదు అందజేస్తున్న శ్రీనివాసరావు

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడు శ్రీ విశ్వధర్మ క్షేత్రంలో వేద పాఠశాల భవనం నిర్మించనున్నారు. ఇందుకోసం సత్తుపల్లికి చెందిన తుమ్మూరు శ్రీనివాసరావు దంపతులు రూ.లక్ష విరాళాన్ని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్రం నిర్వాహకులు వెల్లటూరి ప్రసాదాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

19న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు ఈనెల 19న పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్ కుమార్ తెలిపారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలోని జెడ్పీ పాఠశాలలో జరిగే పోటీలకు క్రీడాకారులు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణపత్రం, పాస్‌పోర్ట్ ఫొటో, ఫుట్‌బాల్ కిట్‌తో హాజరుకావాలని సూచించారు. ఇక్కడ ఎంపిక చేసే ఉమ్మడి జిల్లా జట్టు ఈనెల 28 నుంచి నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 99896 47696 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల వికాసం



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీనివాసాచారి

తల్లాడ: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నందున విద్యార్థులకు నాణ్యమైన విద్య అంది వారిలో వికాసం సాధ్యమవుతుందని విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. మండలంలోని అన్నారుగూడెం ప్రభు త్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటుచేసిన సమావేశానికి ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్ అధ్యక్షత వహించగా ఎస్ఈ మాట్లాడారు. వివిధ హోదాల్లో ఉన్న అధికారులే కాక తాను సైతం ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని, ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించి పిల్లలను చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యాసంస్థల కంటే మెరుగైన వసతులు ఉండడమేకాక నాణ్యమైన విద్య, ఉచితంగా పుస్తకాలు, యూని ఫామ్, మధ్యాహ్న భోజనం అందుతున్నాయని తెలి పారు. అనంతరం వివిధ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన నగదు బహుమతులు అందజేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ బొజ్జా అప్పారావు, మహ్మదీయ విద్యాసంస్థల అధినేత ఎస్.కే.అబ్దుల్‌పాషా, పూర్వ విద్యార్థులు దారా విష్ణుమోహన్‌రావు, మారెళ్ల లక్ష్మణ్‌రావు, గోవిందు శ్రీనివాసరావు, తుమ్మలపల్లి రమేష్, దుగ్గినేని గోపయ్య, ఏఈ ప్రసాద్, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత ఫిర్యాదుతో కేసు నమోదు

చింతకాని: అదనపు కట్నం కోసం వివాహితను వేధించిన ఆమె భర్త సహా నలుగురిపై చింతకాని పోలీసులు మంగళవారం కేసు నమోదుచేశారు. మండలంలోని కొదుమూరుకు చెందిన నాగరాణిని రేపల్లెవాడకు వడ్డెబోయిన గోపి ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వివాహ సమయాన 30 కుంటల పొలం, నాలుగు తులాల బంగారం, రూ.5 లక్షల నగదును నాగరాణి తల్లితండ్రులు కట్నం కింద ఇచ్చారు. అయినా అదనపు కట్నం కోసం గోపితో పాటు అత్త రోశమ్మ, మరిది వంశీ, భర్త మేనమామ నాగేశ్వరరావు వేధిస్తుండడంతో ఆరు నెలల క్రితం నాగరాణి పుట్టింటికి వెళ్లిపోయింది. గత శుక్రవారం గ్రామపెద్దలతో చింతకానిలో పంచాయితీ నిర్వహించినా అదనపు కట్నం తీసుకురావాల్సిందేనని భర్త, కుటుంబీకులు స్పష్టం చేశారు. దీంతో నాగరాణి ఫిర్యాదు మేరకు నలుగురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,100	1,850
పెసలు	7,200	6,000
అలసంద	6,150	6,150
మిర్చి	12,600	6,000
ఏసీ మిర్చి	14,000	8,200
మిర్చి తాలు	6,800	6,300
పత్తి	7,100	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.18,748



స్కూల్ బ్యాగ్‌లను పరిశీలిస్తూ..



పెట్టె, బకెట్ కొనుగోలు చేసిన మహిళలు



ఖమ్మంలోని బుక్‌స్టాల్‌లో సందడి

బడి.. సందడి



హాస్టల్ విద్యార్థి కోసం పరుపు..

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ఈనెల 12నుంచే పాఠశాలలకు పంపిస్తున్నారు. అయితే, హాస్టళ్లలో ఉండే వారిని మాత్రం సోమవారం నుంచి చేర్పిస్తున్నారు. ఈమేరకు విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, యూనిఫామ్, పెట్టెలు, బ్యాగ్‌లు, పరుపులు, ఇతర సామగ్రి కొనుగోళ్లకు వస్తున్న వారితో జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధులు సందడిగా కనిపిస్తున్నాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



యూనిఫామ్ కొనుగోలు చేస్తున్న తల్లిదండ్రులు

దివ్యాంగులకు చేయూత

- శారీరక దివ్యాంగులకే కాక బధిరులు, అంధులకు ఉపకరణాలు
- ఆన్‌లైన్ ద్వారా కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ
- నేటితో గడువు ముగుస్తున్నందున పొడిగించాలని వినతులు

ఖమ్మంమయూరిసెంటర్: దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారికే కాక బధిరులు, అంధులు వినియోగించే, వారికి సాయపడే ఉపకరణాలు అందించనుండగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హులను ఎంపిక ఉంటుందని, ఇందులో విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కాగా, ఉపకరణాలు అవసరమైన దివ్యాంగులు https:// tsobmms. cgg. gov. inవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆధార్‌కార్డు, సదరం / యూడీఐడీ సర్టిఫికెట్, బోనఫైడ్, నివాస, వయస్సు, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, నిరుద్యోగులైతే సెల్ఫ్ డిక్లరేషన్‌ను దరఖాస్తు జత చేయాలి.

అర్హతలు ఇలా..

ఉపకరణాలు పొందేందుకు 40శాతం అంతకన్నా ఎక్కువగా అవయవాలు పనిచేయని దివ్యాంగులు, డిగ్రీ లేదా తత్సమాన కోర్సు చదువుతున్న వారు అర్హులని అధికారులు పేర్కొన్నారు. నిరుద్యోగులైతే కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల్లోపు వార్షికాదాయం కలిగి, 18 – 55 వయస్సు ఉన్న వారిని పరిగణనలోకి తీసుకుంటారు. ఇక నిరుద్యోగులైన దివ్యాంగులకు ఎలాంటి మోటారు వాహనాలు ఉండొద్దు. అధికారులకు అందిన దరఖాస్తుల ఆధారంగా ఉపకరణాల పంపిణీలో విద్యార్థులకు తొలి ప్రాధాన్యత ఇస్తారు. అలాగే విద్యార్థి, నిరుద్యోగుల్లో వైకల్య శాతం ఎవరికి ఎక్కువ ఉంటే వారినే ఎంపిక చేస్తారు. ఆతర్వాత దశలో ఎక్కువ వయసు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. అధికారుల పరిశీలన తర్వాత కలెక్టర్‌కు జాబితా పంపించి, వివిధ శాఖల అధికారులతో జిల్లా స్క్రీనింగ్ కమిటీ ద్వారా లబ్ధిదారులను ఖరారు చేస్తారు.

జిల్లా లక్ష్యం ఇలా..

దివ్యాంగులకు వివిధ ఉపకరణాలు అందించేందుకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలు 100, బ్యాటరీ వీల్ చైర్స్ 30, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసికిల్స్ 40, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటోలు రెండు, హైబ్రిడ్ వీల్‌చైర్ అటాచ్‌మెంట్ పది అందించనున్నారు. అలాగే, డిగ్రీ విద్యార్థులు 15మందికి ల్యాప్‌టాప్‌లు, ఆపై కోర్సులు చదువుతున్న వారికి 15 ల్యాప్‌ట్యాప్‌లు అందిస్తారు. ఇక ట్యాబ్‌లు 25, 5జీ స్మార్ట్ ఫోన్లు ఐదు, ట్రైసైకిళ్లు 12, వీల్‌చైర్‌లు 12, క్రైచెస్ 50, ఇయరింగ్ ఎయిడ్స్ ఐదు, వాకింగ్ స్టిక్‌లు 50, స్మార్ట్ కెన్స్ 25, ఎంసీఆర్ చెప్పల్ 25 యూనిట్లను జిల్లాకు కేటాయించారు. మొత్తం 438 ఉపకరణాలు అందించనుండగా, ఇప్పటివరకు 327 దరఖాస్తులు అందాయి. బుధవారంతో గడువు ముగియనున్న నేపథ్యాన మరింత సమయం ఇవ్వాలని దివ్యాంగులు కోరుతున్నారు.

‘ఆఫ్‌టైప్’కు పరిహారం చెల్లించకపోతే ఆందోళనలు

రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి తీగల సాగర్



ఆయిల్‌పామ్ తోటతో పరిశీలిస్తున్న రాష్ట్ర రైతు సంఘం నాయకులు

సత్తుపల్లి/వేంసూరు: ఆయిల్‌పామ్ సాగుచేయగా, ఆఫ్‌టైప్ మొక్కలు వచ్చిన రైతులకు పరిహారం చెల్లించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ హెచ్చరించారు. సత్తుపల్లి, వేంసూరు దమ్మపేట మండలాల్లోని ఆయిల్‌పామ్ తోటలు, రేగళ్లపాడులోని నర్సరీని మంగళవారం సంఘం ప్రతినిధులు పరిశీలించారు. అనంతరం సత్తుపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తోటలోనే 40 ఆఫ్‌టైప్ మొక్కలు వచ్చాయని చెప్పారని, తద్వారా ఇంకా ఎందరు రైతులకు ఇలా జరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. నాలుగేళ్లుగా ఆఫ్‌టైప్ మొక్కలు వస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడంతో ఒక్కో రైతు ఎకరాకు రూ.6 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తోందని తెలిపారు. రేగళ్లపాడు నర్సరీలో 2.20 లక్షల మొక్కలను తీసివేయకుండా రైతులకు ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నించడం సరికాదన్నారు. ఇకనైనా ఆయిల్‌ఫెడ్ అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించడమే కాక పామాయిల్ మద్దతు ధరను టన్నుకు రూ.25వేలు ఇవ్వాలని సాగర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు బొంతు రాంబాబు, కొక్కెరపాటి పుల్లయ్య, తుంబూరు ఉమామహేశ్వర రెడ్డి, చెలికాని సూరిబాబు, అన్నవరపు సత్యనారాయణ, బాల బుచ్చయ్య, వెంకట్రావ్, మోరంపూడి పాండు, సర్వేశ్వరరావు, రావుల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధాలతో అభివృద్ధి సాధ్యం కాదు..



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలకు అమెరికా సామ్రాజ్యవాదమే కారణమని.. యుద్ధాలతో కాకుండా దేశాల మధ్య సఖ్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సీపీఎం పాలేరు నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో నిర్వహించారు. ఈ తరగతులకు నాయకురాలు బుగ్గవీటి సరళ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా సుదర్శన్‌రావు, నాగేశ్వరరావు మాట్లాడారు. అమెరికా అణ్వాయుధాలను అమ్మేందుకే యుద్ధాలను సృష్టిస్తోందని ఆరోపించారు. కాగా, రాష్ట్రంలో సంక్షేమ పాలన పేరుతో మోసం జరుగుతోందనే విషయాన్ని ప్రజలు గుర్తించారని తెలిపారు. భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు విస్తృతం చేస్తామని, ఇందుకు కలిసి వచ్చే అందరినీ కలుపుకుపోతామని వారు చెప్పారు. ఈ తరగతుల్లో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు షేక్ బషీరుద్దీన్, నండ్రా ప్రసాద్, సుదర్శన్ రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, కొమ్ము శ్రీను, మల్లెల హన్మంతరావు, తోటకూరి రాజు, కే.వీ.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వెళ్లొస్తుండగా ప్రమాదం

ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టడంతో విద్యార్థులకు గాయాలు



గాయపడిన విద్యార్థులతో మాట్లాడుతున్న సీఎంఓ రాజశేఖర్

కొణిజర్ల: పాఠశాల విద్యార్థులతో పాటు ప్యాసింజర్లతో వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు విద్యార్థులు, ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని రామనరసయ్యనగర్ సమీపాన మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. రామనరసయ్యనగర్ నుంచి బాలబాలికలు కొణిజర్లలోని జెడ్పీహెచ్ఎస్‌కు వచ్చి సాయంత్రం ఆటోలో గ్రామానికి బయలుదేరారు. ఆటోలో ఐదుగురు బాలురు, మరో మహిళ ఉండగా, గ్రామ సమీపానికి చేరగానే పొలాల నుంచి మట్టి తీసుకొస్తున్న ఓ ట్రాక్టర్ ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటోలోని విద్యార్థులు ఇస్లావత్ వంశీ, ఆంగోత్ వీరేందర్, బోసు మహేష్, ధర్మసోత్ అర్జున్, పల్లపు మహేష్‌తో పాటు గుగులోత్ భద్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో వంశీ పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంకు, మిగిలిన వారికి కొణిజర్లలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఎంఈఓ అబ్రహం, హెచ్ఎం శాంతకుమారి ఆస్పత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేయగా డీఈఓ సత్యనారాయణ, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఫోన్‌లో మాట్లాడారు. ఘటనపై ఎస్ఐ జి.సూరజ్ కేసు నమోదు చేయగా,కొణిజర్లకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పరారైనట్లు తెలిసింది. అలాగే, ఖమ్మం ఆస్పత్రిలో సీఎంఓ రాజశేఖర్ విద్యార్థులను పరామర్శించి చికిత్సపై ఆరా తీశారు.

చోరీల కేసులో నిందితుడి అరెస్ట్

నేలకొండపల్లి: బైక్‌లతో పాటు ఇతర వాహనాల చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సంతోష్ తెలిపారు. మండల కేంద్రంలో గత వారం క్రితం బైక్ చోరీకి గురికాగా దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. ఈమేరకు చెన్నారం వాసిసైదులును అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేలకొండపల్లిలో బైక్‌తోపాటు నార్కట్‌పల్లి, మిట్టపల్లి పరిధిలో మరోరెండు ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్ ఇంజన్ చోరీ చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. దీంతో ఆయనను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

తండ్రి కళ్ల ముందే కుమారుడు మృతి

కూసుమంచి: స్కూటీపై వస్తున్న తండ్రీకుమారులు ప్రమాదానికి గురవడంతో కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా, తండ్రి తీవ్రగాయాలతో బయటపడ్డాడు. కూసుమంచి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంకు చెందిన బానోత్ బాలాజీ తన కుమారుడు మణిచందన్(21)తో కలిసి స్కూటీపై సూర్యాపేట జిల్లా బురకచర్ల వెళ్లి వస్తున్నాడు. కూసుమంచి సమీపాన రహదారిపై డీజిల్ అయిపోవడంతో నిలిచిన డీసీఎంను వెనక నుండి స్కూటీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీ నడుపుతున్న మణిచందన్ అక్కడిక్కడే మృతి చెందగా వెనుకాల కూర్చున్న బాలాజీకి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో పోలీసులు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

నెలల వ్యవధిలో తల్లీకొడుకు...

రఘునాథపాలెం: తల్లిని కోల్పోయిన నెలలకే ఆమె కుమారుడు మృతి చెందడం కుటుంబంలో విషాదాన్ని నింపింది. వీ.వీ.పాలెంకు చెందిన బానోతు బాలాజీ – రంగాబాయి దంపతులు. అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసే రంగాబాయి కొద్ది నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందింది. ఇక బాలాజీ తన కుమారుడు మణిచందన్‌తో కలిసి బురకచర్ల వెళ్లొస్తూ ప్రమాదం బారిన పడ్డారు. ఈ ఘటనలో మణిచందన్ మృతిచెందగా, బాలాజీ తీవ్రగాయాలతో చికిత్స పొందుతుండగా కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మణిచంద్ర ఇటీవలే డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతుండగా ఈ విషాదం చోటుచేసుకుందని గ్రామస్తులు తెలిపారు.

అప్రమత్తతతోనే సీజనల్ వ్యాధులు దూరం



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: ప్రజలు ఇళ్లలోనే కాక పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులు దరిచేరవని డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి తెలిపారు. ఖమ్మం మామిళ్లగూడెంలోని యూపీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేసిన ఆమె వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక, ఓపీ సేవలను పరిశీలించాక చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడుతూ డయేరియా నిర్మూలన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వైద్యాధికారి కృష్ణచైతన్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

బైక్‌లపై స్టంట్లతో యువకుల వీరంగం

నేలకొండపల్లి: పట్టపగలు బైక్‌లపై విన్యాసాలు చేసిన యువకులు పలువురు నేలకొండపల్లిలో వీరంగం సృష్టించడమే కాక ఇదేమని అడిగిన వారిపై దాడికి యత్నించారు. నేలకొండపల్లిలో మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు యువకులు బైక్‌లపై వెళ్తూ విన్యాసాలు చేస్తూ రిటైర్డ్ కానిస్టేబుల్‌కు బైక్‌ను అడ్డు పెట్టారు. దీంతో ఆయన ప్రశ్నించగా అసభ్య పదజాలంతో దూషించగా, అడ్డుకోబోయిన మరో వ్యక్తిపై దాడికి దిగారు. ఈ గొడవలో నేలకొండపల్లి ప్రధాన సెంటర్‌లో జనం గుమిగూడగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అంగన్‌వాడీలు.. అభివృద్ధి కేంద్రాలు



అక్షరాభ్యాసం చేయించాక చిన్నారులతో డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి

కూసుమంచి: పిల్లల మనోవికాసం, అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు మార్గంగా నిలుస్తున్నాయని జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జీళ్లచెరువులో మంగళవారం అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం డీడబ్ల్యూఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తే ప్రీ స్కూల్ విద్యతో పాటు పౌష్టికాహారం అందుతుందని తెలిపారు. అనంతరం చిన్నారులకు నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ పోటీలు అలరించాయి. ఐసీడీఎస్ సీడీపీఓ కవిత, సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

కల్లూరు: కల్లూరులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పడమట లోకవరానికి చెందిన బొద్దు నర్సింహారావు, ముత్యాల ఎల్లారావు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నర్సింహారావుకు స్వల్పగాయాలు కాగా, ఎల్లారావు(32)కు తీవ్రగాయాలు కావడంతో స్థానికంగా చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయన తల్లి రాంబాయి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన జారీ చేసిన చెక్కు చెల్లకపోవడంతో సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన రంగవరపు ఉమామహేష్‌కు ఏడాది జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ తీర్పుచెప్పారు. మంగళవారం వెలువడిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. ముదిగొండ మండలం మేడేపల్లికి చెందిన వ్యక్తి వద్ద ఉమామహేష్ 2013 ఫిబ్రవరిలో రూ.3.80లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి 2014 ఫిబ్రవరిలో ఆయన జారీ చేసిన చెక్కును బ్యాంకులో జమ చేస్తే సరిపడా నగదు లేనందున తిరస్కరణకు గురైంది. దీంతో ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. కేసు విచారణ అనంతరం ఉమామహేష్‌కు ఏడాది జైలు శిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.3.80లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.